# మెఱుపులు: నీతిలేని వ్యాపారం

- వేమూరి వేంకటరామనాథం

వెనుక ఒక "తెలుగు జ్యోతి" సంచికలో మహాత్మాగాంధీ పేర్కొన్న సాంఘిక దోషాలను గురించి ప్రస్తావించాను. వాటిలో ఒక దానిని గుఱించి - నీతి (ధర్మం) లేని వ్యాపారం- ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

వ్యాపారమన్నది ప్రపంచ మంతటిలోను కొందఱు (ఎందఱో) వ్యక్తులు ఎన్నో ఆర్థిక రంగలలో అనేక విధాల చేస్తూ ఉంటారు. సాంఘిక వ్యవస్థ ఏ రాజకీయప్రత్యేక లక్షణాలకు లోబడి ఉన్నా, కొందఱు కొన్ని కొన్ని వస్తువులను, లేక సౌకర్యాలను, ఉత్పత్తి చేయటం అవి కావలసిన వారికి (కొనుగోలుదారులంటాము) అవి విక్రయించటం అనాదిగా వస్తూ ఉన్న పరిస్థితియే. కాలక్రమాన ఉత్పత్తిదారులకు కొనుగోలుదారులకు మధ్య అంతరం పెరిగి వారు వేరు వేరు సమూహాలుగా నిలిచి యుండటం మనం గమనిస్తున్నాము. ఇది శ్రమవిభజన గాను ఉత్పత్తి - ఆర్థిక సామరస్యంగాను చెల్లుబాటులో ఉంది - అన్ని దేశాలలోను, దాదాపు అన్ని ఆర్థిక రంగలలో.

ఒక వస్తువు గాని సౌకర్యం గాని కావలసినవాడు మఱొక వ్యక్తి (లేక వ్యాపార సంస్థ) నుండి అది పొందవలసిన పరిస్థితి యేర్పడి నప్పుడు - ఇది చాల ఆర్థిక రంగాలలో ఈ నాటి పరిస్థితి - అమ్మే వ్యక్తి (లేక ఈ దినాలలో ప్రధానంగా సంస్థ) అవలంబించే వ్యాపారమార్గాలకు ఎంతో ప్రాముఖ్యం, సంఘక్షేమం మీద వాటికి ఏకొంతగానో నిర్ణయాధికారం ఉంటుంది. కొనుగోలు దారుల యెడ ఉత్పత్తి దారులు ప్రదర్శించే (అవలంబించే) విధానలలో నీతి ఉండాలి అని, అది లేని వ్యాపారం సాంఘిక దోషంగా పరిగణించ వలసి యుంటుందని, మహాత్ముని అభిప్రాయం. ఈ ఊహను వివరించటంలో మొట్టమొదటి అంశంగా వ్యాపారం అన్న ఆర్థిక చర్యలో గల కొన్ని విశిష్ట విషయాలు గమనించుదాం. ఇవి తగురీతిని అవగాహన చేసికొనక పోతే, మనం విమర్శించే పరిస్థితుఅలను గుఱించిన సంగ్రగ్రాలజాం మనకు దక్కదు.

వ్యాపారం ఒక ఆర్థిక చర్య. మన ప్రస్తుత సమీక్షకు తగినంత గా దాని సంస్థావిషయక లక్షణాలు కొన్ని గమనించుదాం.

1) వ్యాపారం పెట్టుబడితో కూడిన ఆచరణక్రమం. పెట్టుబడికి ఫలితంగా లాభం రావలెనన్న కాంక్ష గలది వ్యాపారసంస్థ. (అనగా, అది ధర్మసత్రం వంటిది కాదు.)

2) పెట్టుబడికి కలిగే ఫలితం విస్తరించవలెనన్న కాంక్ష పెట్టుబడిదారుని మనస్సులో ఉంటుంది. ఇక్కడ కొన్ని ముఖ్య ప్రశ్నలు రేకెత్తుతాయి; ఉదాహరణకు, ఆర్జించవలసిన ప్రయోజనం -లేక లాభం ఎంతగా ఉండవలెను అన్నది ప్రధానమైన అంశం. ఇది ఎంతగా "గుంజ" కల్గితే అంతగా, అన్నది ఒక సమాధానం. చాలమంది పెట్టుబడిదారులు - లాభంకోసం వ్యాపారంలో దిగేవారు - ఎంత ఎక్కువ ఫలితం పొందగల్గితే అంత మంచిది అనుకొనటం క్షమార్హమైన ఉద్దేశ్య విధానంగదా. అయితే రెండు ప్రశ్నలు రేకెత్తుతాయి. ఒకటి, అలాంటి కోరిన లాభ పరిమాణం ఆసంస్థయొక్క వ్యాపారరంగంలో సంభవమవుతుందా? ఉదాహరణకు, చిల్లర వ్యాపారంలో వలె అమ్మకం సలిపేవారు అసంఖ్యాకులుగా ఉంటే, వారి మధ్యగల "పోటి" శక్తుల వలన ఒకరి లాభం మిగత వారి లాభంకన్న విపరీతంగా ఎక్కువగా ఉండటం తటస్థించదు. లాభం అత్యధికంగా వస్తున్న పరిస్థితి ఏర్పడితే అది పసిగట్టి క్రొత్త వ్యాపారస్థులు ఆరంగంలోకి దిగుతారు. యంత్రాది భారీ పెట్టుబడి వ్యయాలకు అవసరంలేనిది ఆర్థిక రంగం; అందు వలన ఇది సులభంగా సంభవిస్తుంది. ఆవిధంగా ఏ ఒక్కని లాభశాతం కొండనంటేట్లు ఉండదు. రెండు, ఉత్పాదన పరిస్థితులు , పెట్టుబడి - అసౌలభ్యాలు కొన్ని రంగాలలో వ్యాపారస్థునికి, ఇతరులు ప్రవేశించి తన

లాభం పడగొట్టకుండా, అత్యధికంగా లాభం కలిగించే అవకాశం కలిగిస్తాయి. అనగా తన వ్యాపారరంగంలో కొంతగా "గుత్త" వ్యాపారపరిస్థితులు ఏర్పడతాయి. ఆకారణంగా తనకు లాభం అధికంగా రాగలదు. ఇక్కడ మన సమీక్షలోని రెండవ ప్రశ్న తలయెత్తుతుంది; అది సాంఘిక దృష్టిలో అనుమతించదగిన పరిస్థితియా? ఆర్థిక సమీక్షలో కొంచెం లోతుకుపోతే, యిక్కడ రేకెత్తే ప్రశ్నయేమంటే, వివిధకారణాల వలన కొన్ని వ్యాపార సంస్థలకు "అధిక" లాభలు కలుగుతున్నప్పుడు, ఆ అంగడి (market) పరిస్థితిని సంఘం చూస్తూ ఊరుకొనటమేనా, లేక, ఏదైనా విఘుగుడు కల్పించాలా? అలాంటి ప్రభుత్వదృక్పథం ఈ నాడు దరిదాపు అన్ని దేశాల లోను ఏ కొంత గానైనా, ప్రబలియుంది. దానికి ప్రధానంగా బలం కూర్చే దృక్పథం ఏమంటే, అంగడి వసతులు కారణంగా సంక్రమించే అధికలాభాలు అరికట్టబడవలసిందే, సంఘక్షేమం కోసం అని. ఇది జరగక - లేక శక్తిమంతంగా ప్రదర్శింపబడక - ఒక వ్యాపారస్థుడు లేక సంస్థ అధిక లాభాలు అనుభవించటం తటస్థిస్తే అది సాంఘిక ద్రోహం క్రిందకు వస్తుంది, అన్నది మహాత్ముని ఊహలో దాగియున్న ఆర్థికపరిస్థితి.

ఈ ద్రోహానికి కారణం వ్యాపారం చేస్తూ లాభతృష్ణగల వర్తకులు మాత్రమే కాదు. వారి దాదాపు సహజచర్యలకు అంకుశం సరియైనది వేయగల శక్తి గాని ఉత్సాహం గాని లేని ప్రభుత్వం కూడ.

3) పెట్టుబడిదారుని దృష్టి లాభం మీద ఉంటుంది. కనుక అది ధర - వ్యయముల వ్యత్యాసం మీద ఆధారపడి యుంటుంది కనుక, వాని నిరంతరదృష్టి సాధ్యమయినంత రీతిని ఒక పెద్దధరనో లేక వివిధమైన (అంగడులలో) ధరల మూలంగానో మొత్తం రాబడి తన మొత్తం వ్యయానికి అత్యున్నతంగా మించి ఉండవలెనన్న తాపత్రయంలో అతడు ఉంటాడు. ఇది మానవసహజమైన ప్రవర్తనయే కాక, ఆర్థికరంగ దృష్ట్యా ఆలోచించినా పెట్టుబడి వ్యవహారంలో ఉండవలసిన నేర్పునకు ఇది తార్కాణం అని మనం గ్రహించాలి. సాంఘిక దృష్ట్యా ఒక విశేషం గమనించాలి. వ్యపారస్థుడు ధరలను హెచ్చించి లాభం పొందచూడడం కన్న వ్యయములను తగ్గించి అదే ఫలితం పొందటం మీద ఎక్కువ దృష్టిని నిగుడ్చవలసి యుంటుంది. ఇది తనకే కాక సంఘానికి మేలు కూర్చినట్లు అవుతుంది. ఇది నీతిగల వ్యాపారానికి ఒక విధమైన ఉదాహరణ.

అయితే ఈ వ్యయనిగ్రహంలో ఒక ప్రత్యేక అంశం ఉంది. చాల పరిశ్రమలలో, వ్యాపారాలలో - కూలి వారికి ఇచ్చే వేతనం మొత్తం వ్యయాలలో పెద్ద నిష్పత్తిలో ఉన్న సందర్భాలలో - వారికి ముట్టే రాబడిని వీలయినంత వఱకు హ్రస్వీకరించవలెనన్న తలంపు పరిశ్రమకర్తకు కల్గ వచ్చును; కాని అది అసాంఘికమైన చింతనగా మనం పరిగణించాలి. బేరం చేయటంలో పట్టులేని కార్మికులు పరిశ్రమాధికారి చేతిలో పిప్పి కావచ్చును. ఈ దుస్థితి వాటిల్ల కుండా ప్రభుత్వం తగురీతిని, వలసిన నేర్పుతో, కూలీ వేతనాలను గూర్చిన ఆంక్షలు నిర్వహిస్తుంది. ఈ నిర్వహణక్రమం దినదినం ప్రబలమవుతున్నది. ఇది పారిశ్రామికులకు తక్షణ - అసౌకర్యంగా కనిపించినా, ఇది లేక వారు ప్రదర్శించగల స్వాతంత్ర్యం అ సాంఘికమని ప్రజాబాహుళ్యం విశ్వసిస్తున్నది; అంతే కాదు ప్రభుత్వం తగురీతిని దానిని అరికట్ట ప్రయత్నిస్తున్నది. అనేక దేశాలలో. వారి ప్రయత్నం ఎంత ఫలవంతంగా ఉంటుంది అన్నది ముఖ్య సమస్య. రాజకీయాలలో ప్రజావాణి బలవంతం అవుతున్నకొలది యీ విషయంలో కొంతగానైన కార్మిక శ్రేయస్సు కోసం నిక్కమైన ప్రయత్నాలు జరుగుతాయి. ఇవి నిష్ఫలమైనా, తగినంతగా కార్మికక్షేమకరం కాకపోయినా, జరుగుతున్న వ్యాపారం,

పరిశ్రమ నీతి (ధర్మం) లేనిదిగా మనం ఈసడించవలసి యుంటుంది.

ఈ వ్యాసం పొడిగించుకు పోవచ్చునుగాని, దాని ప్రధాన లక్ష్యాలను ఈ క్రింది విధంగా పొందుపఱచవచ్చును.

ఒకటి, ఉత్పాదన కార్యంలో పాల్గొన్న మానవులకు - కూలీలు, లేక జీతగాళ్ళు అన్న పేర్లను వ్యవహరింపబడే వారికి - సవ్యమైన పారితోషకములు అందచేయబడాలి. "సవ్యమైన" అనగా వారికి మానవతాదృష్టిని ఎంతకు తగ్గని వేతనాలు ముట్టచేయాలో గమనించి వారి ఆదాయక్రమం దానికి అనుగుణంగా దానికి తగ్గకుండా నిర్ణయించాలి. ఈ సూత్రం బేరమాడగల బలం లేని కూలివర్గాల విషయంలో ప్రత్యేకంగా ప్రాముఖ్యం వహిస్తుంది. వారికి ఉత్పాదన విషయకంగానే కాక, మానవతా దృష్టిని ఎంతగా వేతనం - కూలీ డబ్బులు - ముట్టజేయటం ఉచితమో నిర్ణయించాలి. ఈ రోజులలో చాల వఱకు ప్రభుత్వనిబంధనలపుణ్యమా అని "ఇంతకు తగ్గి వారి కూలీ వేతనం ఉండకూడదు" అన్న గ్రహింపు చాల మంది ఉద్యోగదాతలకు విదితమైన విషయమే. కాని బొటబొటీలుగా చట్టబంధితమైనంత వఱకు మాత్రమే కాక, మానవతా వివేకంతో కూలీలకు తగినంత పారితోషకం అందచేయటం ఉద్యోగదాతలు తమ సాంఘిక ధర్మంగా పాటించాలి.

రెండు, కొనుగోలుదారునికి వలసిన ఆర్థిక రక్షణ కల్గజేయవలసిన అగత్యం క్రమంగా బలిష్ఠం అవుతున్నది. పోటీ రంగంలో కాక ఏకొంతగానైనా "గుత్త" పరిస్థితులలో (monopoly) పనిచేస్తున్న వ్యాపారసంస్థలు తమ ప్రత్యేక స్థానం బలంగా ధరలను పెంచటం మీద, వేఱు వేఱు కొనుగోలుదారుల వర్గాలకు ఇష్టం వచ్చినట్లు తమకు లాభం విస్తృతించేట్లు ధరలను అవలంబించటం మీద, తగు ఆంక్షలకు ఆవస్యకత ఉంది. ఇదొక కారణంగా గుత్తవ్యాపారాలమీద ప్రత్యేక ఆంక్షల దృక్పథం ప్రకటించే న్యాయసూత్రాలు అన్నిదేశాలలోను కొంతకొంతగా అవలంబింపబడుతున్నాయి. ఇవి చట్టమాత్రంగానే కాక, ఆచరణస్థాయిలో బలిష్ఠంగా ఉండేట్లు చూడవలసిన ఆవశ్యకత ఉంది, ప్రభుత్వపాలకులకు. కేవలం చట్టం చేశాము గదా అన్న తృప్తికన్న, అది వాస్తవికంగా ఎంతవఱకు పటిష్ఠంగా ఫలవంత మవుతున్నది అన్న ప్రశ్నను జాగ్రత్తగా పరిశీలించి మధ్యమధ్య వలసిన సవరణలు చట్టంలోను, దాని అమలు లోను చేస్తూఉండాలి. ఈ సందర్భంలో ఎదుర్కొనవలసిన సమస్య ఒకటి ఉంది: చట్టం సరిదిద్ద వలసిన కూటమిలో కూడ "గుత్త" లాభాలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో అందుకొంటున్న వ్యక్తులు సంస్థలు ఉంటాయి, తమ తమ ప్రభావం ఏ కొలదిగానో చట్టం మీద చూపుతూ ఉంటారు.

ఈ వ్యాసం ముగించే ముందు దాని శీర్షికకు నేరుగా సరిపోయే వ్యాపార మొక దానిని గూర్చి రెండు మాటలు మనవి చేస్తాను. చాల దేశాలలో కొన్నింటిలో ఉధృతంగా మత్తుమందు మొక్కలను నాటి అతి లాభకరమైన వ్యవసాయం చేయటం ప్రబలింది. దీనివలన ఆదాయం ఎక్కువగా సంక్రమిస్తుంది. ఆ కలుపు కూర్చేవారికే కొంతగానో ప్రతిఫలం కల్గినా, అది అంగడికి తగురీతిని తయారు చేసి, అది కోరే వాడుక దారులకు దానిని అందచేయటంలో ఆరితేరిన వారికి అధికస్థాయిలో లాభాలు దక్కుతాయి. పైగా, ఇది చట్టవిరుద్ధమైన వ్యాపారం కనుక, అది పట్టుకొనే ఉద్యోగులు కోరచూపులతో దాని ఉనికి గమనించి, దాని కర్తలను పట్టుకుని, ప్రభుత్వానికి తెలియపఱచ వలసియుంటుంది. ఈ విధమైన వ్యాపారంలో సాధ్యమయ్యే ధన ప్రయోజనం మిగత వ్యాపారా లెన్నింటిలో కన్ననో విపరీతంగా ఉండటంవల్ల, దాని కర్తలు తమ్ము పట్టుకొన చూసేవారికి ఇంతో అంతో ముట్టచెప్పుతూ ఉంటారు. లంచం పట్టకూడదని భీష్మించుకొన్న వారిలో కొందటికైనా క్రమంగా ధనం ఉచితంగా తమవైపు పరువులెత్తుతూ ఉండటం చూసి, కొంత కాంక్ష పెరిగి, "ఏదో కొంచెం"

అంటూ మత్తు మందు ఖామందులిచ్చే సులభపారితోషికం రుచికరం అవుతుంది. ఇంకేమి, మత్తు మందు ఉత్పత్తికి సూటి మార్గం ఏర్పడినట్లే. ఈ వ్యవహారిక్రమంలో తేలికగా పాల్గొనని అధికారులకు ప్రాణభయం కూడ సంక్రమిస్తుంది. తెగించిన వాడు ఏమి చేయలేడు, అన్న సామెత అక్షరాల వాస్తవమవుతుంది. ఈ భయం కారనంగా కూడ కొందఱు అజమాయిషీ కుర్చీలో కూర్చున్నవారు నీరసిస్తారు. మత్తుమందు తయారీ, వర్తకం ఏదో విధంగా కొంత రహస్యంగా జరుగుతూనే ఉంటుంది.

ఈ వాస్తవిక్రమం ఏయే దేశాలలో అధికంగా జరుగుతున్నట్లు "తెలిసినవారు" ఊహిస్తున్నారో మనకు వార్తాపత్రికలలో అనుదినం కనపడుతూనే ఉంది. దానిని అరికట్ట వలెనని ప్రభుత్వాలు భీష్మించుకున్నట్లు కూడ మనం వింటూనే ఉంటాం. కాని ఏ కొంతగానో ఈ నీతిలేని వ్యాపారం జరుగుతూనే ఉంది.

ఈ వ్యాపారంలో మనం గమనించవలసినది - వ్యాస శీర్షికకు అనుగుణంగా దానిలో నీతి లేదని మాత్రమే కాదు. దానిలో అపాయం ఉంది కూడ. దానికి బానిస అయినవారి శరీరానికి అది తీరని దెబ్బ వంటిది. ఆ అలవాటు ఒంటికి పట్టి, అది తప్పించుకొనటం సాధారణ వ్యక్తులకు సులభం కాకపోవటం వల్ల , దాని ఆరోగ్యనాశక -ఉధృతి క్రమంగా విజృంభిస్తుంది. ఇలాంటి వస్తు -ఉత్పాదన, అమ్మకము, ఆరగింపు - అన్నీ బందు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది, కాని దాని విజయం ప్రజల సహకారం మీద ఎంతగానో ఆధారపడియుంటుంది.

సమాప్తిలో ఒక అంశం సూచిస్తాను. నీతి లేని వ్యాపారం ఎన్నో విధాల అనాదరణీయశ్రేణి లోకి వస్తుంది. ఆర్థిక ధోరణిలో చెప్పవలెనంటే, ఉత్పత్తికి కారకులయిన కొందఱు, ఉత్పత్తికి నిక్కువమైన ఆధారమైన కొనుగోలు దారులకు, కలిగే అన్యాయాలతో పాటు, అవి సంక్షిప్తం చేయదలచే ప్రభుత్వానికి కష్టం కల్గటమే కాక ఈ విస్తృత కార్యక్రమంలో అనేక స్థలాలలో ఏదో విధంగా కొంత అవినీతి, దాని తావలంగా కొందఱు అన్యాయమైన ధన ప్రయోజనాలు కల్గుతాయి. చివరకు, కొన్ని వస్తువుల సందర్భంలో కేవలం నీతిలోపించటమే కాక, శరీరానికి అపాయం కలిగే అవకాశాలు కూడ ఉన్నాయి. ఈ మొత్తం గొలుసులో అక్కడక్కడ ధనం రుచితో బుడగలు వేసే అక్రమచర్యలు కూడ సంభవమవుతాయి. లోపించేది కేవలం వ్యాపార సరసత్వమే కాదు, చివరకు ప్రజల ఆరోగ్యసౌభాగ్యం కూడ.